క్లుప్తంగా

కలశాలతో అయ్యప్ప భక్తుల ఊరేగింపు


కేశవరంలో ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

పాయకరావుపేట: మండలంలోని కేశవరం గ్రామంలో అయ్యప్ప భక్తులు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. స్వాములు మేడిశెట్టి రామగోవిందు, మేడిశెట్టి రాము, యజ్జల అన్నవరం, మేడిశెట్టి బుజ్జి తదితర స్వాములు ఊరేగింపు నిర్వహించారు.

జోరుగా జంగిల్ క్లియరెన్స్


ఘాట్‌రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న ఎస్ఐ నారాయణరావు

కోటవురట్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. మండలంలోని ప్రమాదకర రహదారులను ఎస్ఐ నారాయణరావు శుక్రవారం పరిశీలించారు. ఇందేశమ్మ వాక, గొట్టివాడ శివారు సాబనాల కొండ ఘాట్‌రోడ్లను పరిశీలించి, ఇరువైపులా భారీగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగింపజేశారు.

బస్సు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్ బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు కె.సోమునాయుడు డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. వరుసగా రెండు రోజుల్లో రెండు రోడ్డు ప్రమాదాలు జరగడం దారుణమన్నారు. పూడిచందు,శివకోటి,శివరాయ అప్పారావు,సూరంపూడి రమణ,సీ.హెచ్ రాజు పాల్గొన్నారు.

రామగిరిలో ఉచిత పశువైద్య శిబిరం

మునగపాక: రామగిరిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన శిబిరంలో 35 పశువులకు పశు వైద్యాధికారులు బాను,ఉమామహేశ్వరి,సుమతి సేవలందించారు.10 లేగ దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. సర్పంచ్ పార్వతి, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు,రామచంద్రరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

రాంబిల్లి: ఉపాధిహామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని పెదకలవలాపల్లి సర్పంచ్ యలమంచిలి కనకారావు అన్నారు. వచ్చే ఆర్థికసంవత్సరం గ్రామంలో చేపట్టబోయే పనులపై సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. సాగునీటి కాలువల తవ్వకాలకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం జగ్గన్నపేటలో భక్తి శ్రద్ధలతో ఏకాహం నిర్వహించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు ఏకాహం జరిగింది. సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ కొల్లి అప్పారావు, మండల కో కన్వీనర్ ఆడారి త్రినాథ్, సర్పంచ్ దొడ్డి కృష్ణ, భాస్కర్‌రావు, గోవింద, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

డీఆర్వోకు వినతిపత్రం

రాంబిల్లి: నేవీ ప్రహరీ పనుల కారణంగా తమ పొలాలకు వెళ్లేందుకు దారులు లేకుండా పోతున్నాయని, తమకు న్యాయం చేయాలంటూ పెదకలవలాపల్లి గ్రామస్థులు శుక్రవారం డీఆర్వో దయానిధికి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

యలమంచిలి: రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లకు యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ డి.ఈశ్వరరావు శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

అమ్మకే అమ్మలా...

గర్భం ధరించాక కొన్ని నెలల్లో పసిబిడ్డ చేతుల్లో ఉంటుందంటే ఎంతో ఆనందం.. ఆలోచనలు... భావాలు ప్రత్యేకం. ఎన్నెన్నో భావోద్వేగాలు, మరెన్నో ఆలోచనలు.. సరిగా నిద్రపట్టనివ్వవు... తిండికూడా సహించదు. అలాంటి పరిస్థితుల్లో వారిని ఇంట్లోవారు పసిపిల్లల్లా చూసుకుంటారు. కావలసినదల్లా పెడుతుంటారు. పండంటి బిడ్డ పుట్టేలా పౌష్టికాహారం పెడతారు. మరి పేదల పరిస్థితి...! అందుకే వారిని అదుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నలా ఆలోచించారు. పూర్తిస్థాయిలో అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. వారి పిల్లలకు ఆటపాటలతో విద్యా బోధనతో పాటు చక్కని ఆహారం సమకూరుస్తున్నారు. దీంతో ఇప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మకే అమ్మలా సేవలందిస్తున్నాయి.

- సేవలందిస్తున్న అంగన్‌వాడీలు
- సీఎం జగన్ ప్రభుత్వంలో 'పోషణ' ఫుల్
- తల్లీ బిడ్డల సంరక్షణే ధ్యేయంగా చర్యలు


అంగన్‌వాడీ కేంద్రంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


నిర్మాణంలో ఉన్న దిబ్బపాలెం అంగన్‌వాడీ కేంద్రం

బాలింతలు, గర్భిణులకు అందించే సరకులు

సరకులు	సంపూర్ణ పోషణ	సంపూర్ణ పోషణ ప్లస్
రాగిపిండి	2 కిలోలు	1 కిలో
అటుకులు	1 కిలో	2 కిలోలు (మల్టీగ్రెయిన్ ఆటా)
బెల్లం	పావు కిలో	అర కిలో
వేరుశనగ చిక్కీ	పావు కిలో	అర కిలో
ఎండు ఖర్జూరం	పావు కిలో	అర కిలో
ఫోర్టిఫైడ్ బియ్యం	3 కిలోలు	3 కిలోలు
పప్పు	1 కిలో	1 కిలో
వంట నూనె	అర లీటర్	అర లీటర్
కోడి గుడ్లు	25	25
పాలు	5 లీటర్లు	5 లీటర్లు

అచ్యుతాపురం(అనకాపల్లి): అంగన్‌వాడీ కేంద్రాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల మెరుగుకు చర్యలు చేపట్టారు. సొంత భవనాల ఏర్పాటుతో పాటు, ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఆటపాటలతో చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. మాతాశిశు సంక్షేమానికి భారీగా నిధులు ఇవ్వడం ద్వారా కొత్త విధానాలతో అంగన్‌వాడీ కేంద్రాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. అంగన్‌వాడీలను ప్రీ స్కూళ్లగా మార్చారు. పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన ఆసరాగా తీర్చిదిద్దారు.

ఇంటి వద్దకే సరకులు

పౌష్టికాహారాన్ని అందించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ఒక్కొక్కరికీ రూ.850, సంపూర్ణ పోషణ ప్లస్‌లో రూ.1,150 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పోషణ కిట్లను తీసుకోవాల్సి వచ్చేది. గర్భిణులు, బాలింతల ఇబ్బందుల నేపథ్యంలో ఇంటికే పోషణ కిట్లను అందించే ఏర్పాట్లు సీఎం జగన్ చేశారు. బాలలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం లేకుండా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది.

పిల్లల ఆరోగ్యం కోసం

ఏడు మాసాల నుంచి మూడేళ్ల వయసుగల పిల్లలకు నెలకు రెండున్నర కిలోల బాలామృతం, రెండున్నర లీటర్ల పాలు, 25 కోడిగుడ్లను అందిస్తారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారాన్ని వండి పిల్లలకు వడ్డిస్తారు.

కృత్యాలతో బోధన

బోధన పూర్తిస్థాయిలో మెరుగుపడింది. కృత్యాలతో కూడిన విద్యను అందిస్తున్నారు. ఆట,పాటలతో బోధించడంలో అంగన్‌వాడీ సిబ్బంది చురుకుగా వ్యవహరిస్తున్నారు. కొత్త భవనాల్లో పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో సిబ్బంది నిరంతం అప్రమత్తంగా ఉంటున్నారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పౌష్టికాహారం అందించడంతో పాటు రక్తహీనతతో బాధపడేవారి విషయంలో అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటూ అవసరమైతే వైద్యసేవలకు తరలిస్తున్నారు.

అంగన్‌వాడీ మెనూ

సోమ, గురువారాల్లో వేడి అన్నం, వెజిటబుల్ కర్రీ, సాంబారు, కోడిగుడ్డు, 100 మి.లీ. పాలు, మంగళ, శుక్రవారాల్లో పౌష్టికాహారంతో పాటు తోటకూర పప్పు, కోడిగుడ్డు, 100 మి.లీ. పాలు, బుధ, శని వారాల్లో వెజిటబుల్ రైస్, పులిహోర, గోంగూర కూర, కోడిగుడ్డు, 100 మి.లీ., వారంలో కనీసం రెండు రోజులు మునగాకు తప్పనిసరి.

19 రకాల ఆట వస్తువులతో ప్రత్యేక కిట్

ఇటీవలే 19 రకాల ఆట వస్తులతో ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి ఒక్కో కిట్‌ను అందజేసింది. ఆ కిట్ లో చిన్నారులకు ఉపయోగపడే మ్యాట్, సాఫ్ట్ బాల్, చెక్కతో చేసిన సంఖ్యల పజిల్, పెగ్ బోర్డు, అబాకస్, చెక్క బూట్లు, బిల్డింగ్ బ్లాక్‌లు, గమ్ స్టిక్స్, 25 ముక్కల రంగుల పేపర్లు, 5 సెట్ల వాటర్ కలర్స్, 5 సెట్ల స్కెచ్ పెన్నులు, 5 ప్యాకెట్ల పెన్సిళ్లు, 5 రబ్బర్లు, 5 షార్పనర్లు. నమూనాల ట్రేసింగ్ బోర్డు, డాఫ్లి, బ్లోయింగ్ సంగీత వాయిద్యాలు, 20 పలకలు బొమ్మలు తయారు చేసేలా 5 సెట్ల మౌల్డింగ్ క్లే, మూడు ప్యాకెట్ల డస్ట్ ఫ్రీ సుద్దలు, బంతితో బాస్కెట్ బాల్ హోప్, 20 కథల పుస్తకాలు అందించారు.




అచ్యుతాపురం మండలం దొప్పెర్లలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనం

మండలం : అచ్యుతాపురం

మొత్తం అంగన్ వాడీకేంద్రాలు	- 76
సిబ్బంది	- 152
సొంత భవనాలు	- 39
ప్రభుత్వ అనుబంధ భవనాల్లో నిర్వహిస్తున్నవి	- 27
ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నవి	- 10
నాడు-నేడులో మొదటి విడత కింద నిర్మాణంలో ఉన్న భవనం	- 01
మరమ్మతులు చేసేందుకు ఎంపికైన భవనాలు	- 50

లబ్ధిదారులు

గర్భిణులు	: 492
బాలింతలు	: 447
7 నెలల నుంచి మూడేళ్ల వయసు పిల్లలు	: 2,574
3 నుంచి ఆరు ఏళ్ల పిల్లలు	: 932

పోషకాహారం అందిస్తున్నారు...



మా బాబు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్నాడు. గతంలో కంటే అదనపు పోషకాలు ఉన్న ఆహారం అందిస్తున్నారు. ఇంటి వద్దకే సరుకులు ఇస్తున్నారు. నెలకు 25 గుడ్లు, 5 లీటర్ల పాలు ఇవ్వడంతో పాటు వైద్య సేవల్ని కూడా అందిస్తున్నారు. నేడు గర్భిణిగా, బాలింతగా ఉన్నప్పుడు కూడా అంగన్‌వాడీ కార్యకర్త బాగా సేవలందించారు.

– పోలవరపు రమ్య,అంగన్‌వాడి చిన్నారి తల్లి, దొప్పెర్ల

పిల్లలకు మెరుగైన బోధన



అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు బాగున్నాయి. పిల్లల్ని బాగా చూసుకుంటున్నారు. పిల్లలకు పోషకాహారం అందిస్తున్నారు. కొత్త భవనాల్లో కొత్త మెనూ అందించడంతో పాటు, పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ బడిలోని గదిలో ఉండేది. ఇప్పుడు ప్రత్యేకంగా భవనం ఉంది.

– కొరుప్రోలు ఉమాదేవి, దొప్పెర్ల

అంగన్‌వాడీ సేవలు భేష్



గతంలో కంటే ఇప్పుడు అంగన్‌వాడీ సేవలు చాలా బాగున్నాయి. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం పెట్టేవారు. ఇప్పుడు ఇంటి వద్ద వంట వండుకునేందుకు వీలుగా అన్ని సరుకులు ఇస్తున్నారు. ఎండు ఖర్జూరం, చిక్కీలు, రాగి పిండి, బెల్లం ఇస్తూ వైఎస్సార్ కిట్‌లను అందజేస్తున్నారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపున్నారు.

– ఎ.కనక, గర్భిణి, దోసూరు

వైఎస్ జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి


అమలాపురంలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు


అరబుపాలెంలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు


గుడివాడలో పల్లె నిద్రలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తదితరులు


దిమిలిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు


ఆవసోమవారంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


కొక్కిరాపల్లిలో బ్రోచర్ అందజేస్తున్న బొద్దపు యర్రయ్యదొర


కుమారపురంలో మాట్లాడుతున్న చిక్కాల

నక్కపల్లి/ఎస్.రాయవరం/పాయకరావుపేట/రాంబిల్లి/యలమంచిలి/మునగపాక/అచ్యుతాపురం (అనకాపల్లి): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి కూరిందని, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సాధించారని, జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపించాలని పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శుక్రవారం పలు గ్రామాల్లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించి, పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన బోర్డులను, పార్టీ జెండాలను ఆవిష్కరించి, పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు.

నవరత్నాల పథకాలను నూరుశాతం అమలు చేసినట్టు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. నక్కపల్లి మండలం అమలాపురంలో నిర్వహించిన రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో మాట్లాడారు. మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలి కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సర్పంచ్ శంకర్రావు, పార్టీనాయకులు సూరాకాసుల గోవిందు, రోకళ్ల శ్రీను, బాబూరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

» ఎస్.రాయవరం మండలం గుడివాడలోని రామాలయ ప్రాంగణంలో శుక్రవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పల్లె నిద్ర చేశారు. పార్టీ జెండాను, సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులతో ఎమ్మెల్యే మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దొంగలు మూకుమ్మడిగా వస్తున్నారని, వారిని ఓటుతో తరిమి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, సర్పంచ్ దూళి శ్రీనుబాబు, పెద ఉప్పలం సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ శానాపతి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, మామిడి చంటి, అచ్యుతరామరాజు, రాముర
ాజు, వర్మ, బాబి, వెంకటరమణ, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, మాజీ జెడ్పీటీసీ కశింకోట నీలేంద్రరావు, పంచాయతీ కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

» పాయకరావుపేట మండలం కుమారపురంలో ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బడుగు,బలహీన వర్గాలకు పలు సంక్షేమ పథకాలను సీఎం అమలు చేస్తున్నారని చెప్పారు. జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, కుమారపురం, గోపాలపట్నం, మాసాహేబుపేట, కేశవరం, సత్యవరం, పాల్మన్‌పేట, రాజగోపాలపురం సర్పంచ్‌లు పురుమాళ్ళ గోవిందమ్మ, పన్నీరు బాబ్జి, గెడ్డమూరి శ్రీనివాసరావు, మేడిశెట్టి రామగోవిందు, సకిలేటి రాము, కోడ కోటేశ్వరరావు, యన్నంరెడ్డి లోవరెడ్డి, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి దేవవరపు రాజేష్ ఖన్నా, ఎంపీటీసీలు కొంతం నరేష్, యాగదాసు శ్రీదేవి శేఖర్, మహేష్‌రెడ్డి, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ బీసీ సెల్ కార్యదర్శి యజ్జల అన్నవరం, నాయకులు రామాల శ్రీను, నీలాపు బాలకృష్ణరెడ్డి, నీలాపు అప్పలరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పక్కుర్తి లోవకుమార్, కార్యదర్శి వై.వి. సత్యనారాయణ, ఏఎల్‌వో కాకాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

» రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు తదితరులు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొట్టాపు లక్ష్మీవడ్డికాసులు, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు.

» యలమంచిలి మున్సిపాలిటీలో కొక్కిరాపల్లి, మండలంలోని ఏటికొప్పాకలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ యలమంచిలి పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మండల నాయకుడు సేనాపతి నిర్వహించారు. కౌన్సిలర్ గొర్ల వెంకట్, సచివాలయ మండల కన్వీనర్ వీసం వాసు, ప్రతాప్‌బాబు, దేవరపల్లి రమణ, వార్డు మెంబరు యర్రంశెట్టి రమణ, జామి రమణ, ఇసరపు శ్రీను, మైలార్ గోవిందు, చీకట్ల శ్రీను, పాలరౌతు మణికంఠస్వామి, కడియం అప్పలరాజు, పాలరౌతు నాయుడు పాల్గొన్నారు.

» మునగపాక మండలంలోని అరబుపాలెంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ హైమావతి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు బొడ్డేడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు. తిమ్మరాజుపేటలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు,ఉపసర్పంచ్ కాంద్రేగుల జగన్ పాల్గొన్నారు.


» అచ్యుతాపురం మండలం ఆవసోమవరంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించి, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు దేశంశెట్టి శంకర్‌రావు, కోన లచ్చన్నాయుడు, పిన్నమరాజు వాసు, సర్పంచ్ కోలా నాగమణి, అప్పలరాజు, తేటకల్ల శ్రీను, పిల్లి సత్తిబాబు, కోళ్ల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పైపు లైన్ ఏర్పాటును అడ్డుకున్న మత్స్యకారులు


పైపులైన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారుల నిరసన

పాయకరావుపేట: మండలంలోని వెంకటనగరం తీరప్రాంతంలో ఏపీఐఐసీ ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల పైపులైన్‌ను స్థానిక మత్స్యకారులు అడ్డుకున్నారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాసరావు, వెంకటనగరం గ్రామ సర్పంచ్ వంకా రమణ ఆధ్వర్యంలో మత్స్యకారులు పైపులైను ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీరప్రాంతంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చోడిపల్లి శ్రీనివాసరావు, వంకా రమణలు మాట్లాడుతూ కాకినాడ సెజ్‌కు సంబంధించిన ఏపీఐఐసీకి సంబంధించిన రసాయన వ్యర్థపదార్థాలు విడుదల చేసే పైపులైన్‌ను వెంకటనగరం తీరంలో వేయడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. మత్స్యకారుల జీవనానికి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ ఏర్పాటును నిలుపుదల చేయించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వంకా జోగుబాబు, గరికిన జగన్నాథం, వంకా దేవుడు, అర్జిల్లి సత్తిబాబు, వంకా ధనరాజు, సురాడ ధనతల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల: కె.వెంకటాపురంలో నూకాంబిక అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, గ్రామ పెద్దలు శుక్రవారం ఆలయం వద్ద హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్ల చిట్టిబాబు, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

శూలాల మహోత్సవాన్ని విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో ఈనెల 27న జరిగే శూలాల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ(తేజ) కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు రాజు పాల్గొన్నారు.

తమ్మయ్యపేటలో మృత్యుంజయ హోమం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దొప్పెర్ల శివారు తమ్మయ్యపేట గ్రామంలోని శ్రీ కాళీ సమేత యోగ లింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మృత్యుంజయ హోమం నిర్వహించారు. క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని యోగరాజ్ ఆశ్రమానికి చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో గరుడ సేవలు నిర్వహించారు.మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు కృషి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

మునగపాక: విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మూడు మండలాల ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపేందుకు చర్య లు తీసుకోవాలన్నారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడుపాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


రాజులు(ఫైల్)

కోటవురట్ల: మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొరుప్రోలు రాజులు శుక్రవారం హఠాన్మరణం పొందారు. తంగేడుకు చెందిన రాజులు ఆ గ్రామ సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు కొరుప్రోలు శివకుమార్ వైఎస్సార్‌సీపీ మద్దతుగా సర్పంచ్‌గా చేస్తున్నారు. రాజులు మృతి పట్ల మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్ఎస్.రామచంద్రరాజు సంతాపం తెలిపారు.